క్లుప్తంగా

ముగిసిన క్రికెట్ టోర్నీ

కడ్తాల్: పరిధి చరికొండలో గాదమోని విజేందర్‌గౌడ్ స్మారకార్థం మూడు రోజులుగా నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేత పోలే అర్జున్‌టీం, రన్నరఫ్ భీష్మాచారి జట్లకు విజేందర్‌గౌడ్ బాల్యమిత్రులు నగదు బహుమతితో పాటు, జ్ఞాపిక అందజేశారు. టోర్నీ స్పాన్సర్స్ శేఖర్, రామకృష్ణగౌడ్, నాయకులు మహేందర్‌గౌడ్, భీష్మాచారి, బాలకృష్ణగౌడ్, వెంకటేశ్‌గౌడ్, యాదగిరిగౌడ్, శ్రీశైలం యాదవ్, సచిన్‌గౌడ్, ఆర్గనైజర్స్ కృష్ణ, తరుణ్, శ్రీరామ్, రఘు, చింటూ, లింగం, హరిచంద్ర, రాజేశ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అన్మాస్‌పల్లిలో బతుకమ్మ సందడి


బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కడ్తాల్: బతుకమ్మ పండుగలో శాస్త్రీయ కోణం దాగుందని సీజీఆర్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధి అన్మాస్‌పల్లిలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఔషధ గుణాలు కలిగిన తంగేడు, గునుగు తదితర పూలతో బతుకమ్మను పేర్చి, చెరువులో నిమజ్జనం చేస్తారని, తద్వారా బ్యాక్టీరియ నశించి, జీవరాశులు తాగడానికి ఆ నీరు అనువుగా మారుతాయని తెలిపారు. అనంతరం పూలగోపురాలను వీధిలో ప్రతిష్ఠించారు. స్థానికులతో కలిసి ఆటపాటలతో సందడి చేశారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకొన్నారు.

సందడే.. సందడి



పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రిజర్వేషన్ల ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. స్థానిక నగారా మోగింది. ఎన్నికల కోడ్ కూసింది. రెండు విడతలుగా తేదీలు ఖరారు అయింది. మరో ఇరవై రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పల్లెల్లో రాజకీయ వేడి మొదలయింది. ఆశావహులు పోరుకు సన్నద్ధం అవుతున్నారు.

- మోగిన స్థానిక నగారా
- కూసిన ఎన్నికల కోడ్
- గ్రామాలకు నేతల పరుగు
- పంచాయతీ పోరుజోరు మరూ
- పల్లెల్లో రాజకీయ వేడి

మంచాల: ఏడాదిన్నరగా ఎదురు చూసిన పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక సందడి మొదలైంది. విజయదశమి నేడే అయినా.. రిజర్వేషన్ల ప్రక్రియ ముందు రోజు నుంచే దసరా, దీపావలి సందడి నెలకొంది. పండుగకు సొంతూళ్లకు వచ్చేవారి సంగతి ఎలా ఉన్నా.. పంచాయతీ పోరు నేపథ్యంలో ఆశావహులు, రాజకీయ నాయకులు నగరాల నుంచి పల్లెబాట పట్టారు. ప్రజాక్షేత్రంలో పరుగు మొదలు పెట్టారు. ప్రజలు సైతం ఇదే అంశంపై చర్చించుకొంటున్నారు. పోటీలో నిలబడేది ఎవరు? గెలిచేదెవరు? ఓడేదెవరు అంటూ ముచ్చటించుకోవడం గమనార్హం.

ఓటర్లు

మంచాల మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉండగా.. 13 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. జనాభా 45వేల 189 మంది ఉండగా.. అందులో 23వేల 210 మంది పురుషులు, 21 వెయ్యి 979 మంది స్త్రీలు ఉన్నారు. కులాల వారీగా ఎస్సీలు 7,459 మంది, ఎస్టీలు 10వేల 433 మంది. ఇతరులు 27వేల 297 మంది ఉన్నారు. ఓటర్లు 39వేల 920 మంది. అందులో 20వేల 477 మంది పురుషులు, 19వేల 443 మంది స్త్రీలు ఉన్నారు.

పంచాయతీలు

23 పంచాయతీల్లో నాలుగు ఎస్సీ.. (ఆగాపల్లి, జాపాల-జనరల్. మంచాల, తాళ్లపల్లిగూడ-మహిళ). తొమ్మిది బీసీ.. (ఆంబోత్ తండా, చెన్నారెడ్డి గూడ, కాగజ్ ఘట్, లింగంపల్లి, నోముల-జనరల్. ఆస్మత్‌పూర్, చీదేడ్, చిత్తాపూర్, తిప్పాయిగూడ- మహిళ). ఆరు ఎస్టీ.. (బండలేమూర్, లోయపల్లి, రంగాపూర్-జనరల్. ఆరుట్ల, దాద్‌పల్లి, పటేల్ చెరువు తండా-మహిళ). నాలుగు జనరల్ (బోడకొండ, ఎల్లమ్మతండా-జనరల్. కొర్రవాణి తండా, సత్తి తండా జనరల్ మహిళ).

ఎంపీటీసీలు..

13 ఎంపీటీసీ స్థానాలకు మూడు ఎస్టీలు (బండలేమూర్-మహిళ. లోయపల్లి, దాద్‌పల్లి- జనరల్). రెండు ఎస్సీలు (ఆరుట్ల-1- జనరల్, మంచాల- మహిళ). బీసీలకు ఐదు (ఆగాపల్లి, చెన్నారెడ్డిగూడ, తాళ్లపల్లిగూడ- జనరల్. లింగంపల్లి, జాపాల- మహిళ). మూడు జనరల్ (ఆంబోత్ తండా, బోడకొండ. ఆరుట్ల- 2 మహిళ).

ఆశావహుల్లో నిరాశ

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలని ఎంతో మంది ఆశించారు. కానీ రిజరేష్వన్లు తారుమారు కావడంతో తీవ్ర నిరాశకు లోనయ్యారు. పోటీకి దూరమయ్యారు. డబ్బులు ఖర్చు పెట్టి, ఎన్నో కార్యక్రమాలు చేసినా.. చివరకు నిరాశే ఎదురైందని వాపోతున్నారు. అనుకూలికులు.. ప్రజాక్షేత్రంలో పరుగు తీస్తున్నారు. గుర్తుంచుకోవాలని వేడుకొంటూ.. ఆశీర్వదించాలని కోరుతున్నారు.

పంచాయతీని ఎస్సీకే ఇవ్వండి..

బీసీలు అధికంగా ఉన్న గ్రామాల్లో ఎస్టీ, పూర్తిగా ఎస్టీలు ప్రాంతంలో జనరల్‌కు కేటాయించడంతో ప్రజలు తీవ్ర అసంతృతి వ్యక్తంచేస్తున్నారు. బండలేమూర్, చెన్నారెడ్డి గూడ, దాద్‌పల్లి గ్రామాల్లో ఒక్క వార్డు కూడా ఎస్సీలకు కేటాయించలేదని ఆయా వర్గాలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదే అంశమై.. బండలేమూర్ గ్రామస్తులు.. మంగళవారం మండల కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. వార్డు రిజర్వేషన్లలో ఎస్సీలకు స్థానం కల్పించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో పది వార్డులు ఉన్నాయని, వాటిలో 5 ఎస్టీలకు, 3 బీసీలకు, 2 జనరల్‌కు కేటాయించారని పేర్కొన్నారు. ఎస్సీలకు ఒక్కటి ఇవ్వలేదని ఆరోపించారు. ఎంపీటీసీతో పాటు.. సర్పంచ్ స్థానం ఎస్సీకి కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. సూపరిండెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు.


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేసిన గ్రామస్తులు

నేడు విజయదశమి

- మస్తాభైన ఆలయాలు
- ముగిసిన దేవీ నవరాత్రులు

ఇబ్రహీంపట్నం: విజయదశమిని పురస్కరించుకొని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజుల పాటు దేవి శరన్నరాత్రోత్సవాలు నిర్వహించి, పదో రోజు విజయదశమి(దసరా) పర్వదినం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. నవరాత్రోత్సవాలు బుధవారంతో ముగియగా.. గురువారం దసరా జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ఊరువాడలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పేద, ధనిక తారతమ్యం లేకుండా ఈ శుభదినాన నూతన వస్త్రాలు ధరించి, జమ్మి వృక్షానికి పూజలు చేసి అమ్మవారిని దర్శించుకుంటారు. పెద్దల ఆశీర్వాదం అనంతరం బంధువులను, స్నేహితులను కలుసుకొని అలైబలై తీసుకుంటారు. ఇదిలా ఉండగా.. గడిచిన నవరాత్రులు ఆలయాలు, మండపాల్లో నిత్య పూజలు అందుకున్న అమ్మవారి విగ్రహాలను.. దసరా మరుసటి రోజు నిమజ్జనం చేస్తారు.


ఈశ్వరాజంనేయ ఆలయంలో కొలువైన దుర్గామాత

మద్యం గిరాకీ ఫుల్

కిటకిటలాడిన వైన్స్, మాంసం దుకాణాలు

ఇబ్రహీంపట్నం: విజయదశమిని పురస్కరించుకొని మద్యం దుకాణాలు కిటకిటలాడాయి. గురువారం దసరాతో పాటు గాంధీ జయంతి ఉండటంతో మద్యం, మాంసం దుకాణాలు మూతపడనున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం వైన్స్, మటన్ షాపులకు జనాలు పోటెత్తారు. విరామం లేకుండా విక్రయాలు జోరుగా సాగాయి. అతి పెద్ద పర్వదినం దసరా సందర్భంగా ప్రభుత్వం ఏమైనా మాంసం, మద్యం దుకాణాలను కొనసాగించే నిర్ణయం తీసుకుంటుందోనని ప్రజలు ఎదురు చూశారు. కానీ సాయంత్రం వరకు ఎలాంటి స్పందన రాలేదు. దీంతో ముందు రోజే కొనుగోలు చేసేందుకు ఆయా దుకాణాలకు బారులు తీరారు.


కడ్తాల్: మైసిగండిలో మహిషాసుర మర్దిని


యాచారం: మహిషాసుర మర్దినిగా జ్ఞాన సరస్వతి


ఇబ్రహీంపట్నం: మహిషాసుర మర్దినిగా రాజరాజేశ్వరి


ఆమనగల్లులో అమ్మవారి పూజలో భక్తులు

జయజయహే మహిషాసుర మర్దిని

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఆఖరు రోజైన బుధవారం దుర్గామాత మహిషాసుర మర్దినిగా భక్తులకు అనుగ్రహించారు. ఈ సందర్భంగా ఆలయాలు, మండపాల్లో కొలువైన అమ్మవారికి నిర్వాహకులు వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య విశేషపూజలు, హోమం, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. –సాక్షి, నెట్‌వర్క్


ఆమనగల్లు: అమ్మవారి సన్నిధిలో భక్తజనం


కడ్తాల్: మైసిగండిలో భక్తులు


ఆమనగల్లు: దుర్గాదేవిగా..

పల్లెపోరులో పై‘చేయి’ మాదే

- అధికార పార్టీ కాంగ్రెస్, ప్రతిపక్షాలు
- పోటీపోటీగా పార్టీ శ్రేణులతో నేతల సమీక్షలు
- గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపు

ఆమనగల్లు/మంచాల: పంచాయతీ ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రాజకీయ వేడి రాజుకుంది. పోటాపోటీగా వివిధ పార్టీల నేతలు.. అధిష్ఠానం ఆదేశాల మేరకు శ్రేణులతో విస్తృత సమావేశాలు నిర్వహిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పై చేయి మనదేనని కాంగ్రెస్ ధీమా వ్యక్తం చేస్తుండగా.. పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీఆర్ఎస్ పిలుపునిస్తోంది.

సంక్షేమమే అభయం

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు విజయ సోపానమని ఆ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు ఎగిరిశెట్టి సత్యం అన్నారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టిన వెంటనే ఆరు గ్యారంటీల అమలు ప్రారంభించామని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉండి.. ఏమీ చేయని బీఆర్ఎస్.. ప్రజల విశ్వాసం కోల్పోయిందని ఆరోపించారు. ఉనికి కోసం ఆ పార్టీ నాయకులు ప్రభుత్వంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. విపక్షాల కుట్రరాజకీయాలను ప్రజలు సమర్థవంతంగా తిప్పికొట్టి, అభివృద్ధిని కాంక్షించి కాంగ్రెస్‌కు అండగా నిలవాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రీను, రాములు, అర్జున్‌రావ్, శ్రీశైలం, పర్వతాలు, వెంకటేశ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.


మంచాల: సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు


ఆమనగల్లు: సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ శ్రేణులు

గెలుపే లక్ష్యం

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బుధవారం మంచాల మండల కేంద్రంలో ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, నాయకులు అంజిరెడ్డి, చంద్రయ్య, పుల్లారెడ్డి, కిషన్‌రెడ్డి, యాదయ్య, రవి, బహదూర్ తదితరులు పాల్గొన్నారు.